వరలక్ష్మి దేవీ నమోస్తుతే..



శ్రీమాతా నిమిషాంబదేవి అమ్మవారు...



భారతీనగర్‌లోని ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ...

వరలక్ష్మి వ్రతాలను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, తమ ఇళ్లలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి ముత్తయిదువులకు వాయినాలను ఇచ్చుకున్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని వరలక్ష్మి అమ్మవారిని వేడుకున్నారు.



మౌలాలిలో వరలక్ష్మీ వ్రతం పూజల్లో కార్పొరేటర్ సునీత



వరలక్ష్మీ వ్రతంలో చిన్నారి



పూజల్లో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్

క్లుప్తంగా...

ఇంటింటికీ మొక్కల పంపిణీ



బోడుప్పల్: ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో 9వ డివిజన్ కార్పొరేటర్ మోదుగు లావణ్య శేఖర్‌రెడ్డి ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలన్నారు. అధికారులు, పాలకవర్గం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ హరిత హారం కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

నేడు చెంగిచర్లలో హరిత హారం

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒకే రోజు కోటి మొక్కలు కార్యక్రమం, హరితహారంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు 2వ డివిజన్ చెంగిచర్ల సుశీల టౌన్‌షిప్‌లో 15వేల మొక్కలు నాటునున్న బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దివ్యాంగుల దైవం కేసీఆర్



దివ్యాంగులకు పెన్షన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: దివ్యాంగుల పాలిట దైవం సీఎం కేసీఆర్ అని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామంతాపూర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులకు పెన్షన్ పెంపు పత్రాలను ఆయన అధికారులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగులకు రూ.4,016 అందించిన ఘనత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉప్పల్ డీసీ ప్రాజెక్టు అధికారి రమాదేవి, డీఈ చందన, సుదర్శన్, శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, కుమారస్వామి, గరికె సుధాకర్, మహ్మద్ ముస్తాక్, శ్రీధర్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి కాంగ్రెస్ టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలి



మాట్లాడుతున్న బోనగిరి సురేష్‌యాదవ్

గౌతంనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి అసెంబ్లీ సీటును స్థానికులకే ఇవ్వాలని కాంగ్రెస్ నేత బోనగిరి సురేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1967 నుంచి 2018 వరకు మొత్తం 11 మంది ఎమ్మెల్యేలుగా సేవలు అందించారన్నారు. అందులో కేవలం ఇద్దరు మాత్రమే స్థానికులు ఉన్నారన్నారు. మిగతావాళ్లు బయట వాళ్లే అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒక ప్రైవేటు సంస్థ సర్వే నిర్వహించిందన్నారు. ఆ సర్వేలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు ప్రస్తావనకు వచ్చాయన్నారు. బయటవాళ్లు గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులోకి రావడం లేదన్నారు. మళ్లీ ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు విజయమ్మ, కృష్ణవేణి, యాదగిరి, కృష్ణప్రసాద్, తిరుపతి గౌడ్, వెంకటేష్, మోహర్ బాబు తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్ ముందస్తు అరెస్టు

రామంతాపూర్: రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నందుకు నిరసనగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నిరసన తెలిపేందుకు బయలుదేరిన రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావును పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం అణగదొక్కుతూ ధమనకాండ కొనసాగిస్తుందని వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్తారన్నారు.

అన్ని హంగులతో ముస్తాబు

- కుషాయిగూడలో జిల్లా కోర్టుల సముదాయం
- నేడు ప్రారంభించనున్న హైకోర్టు చీఫ్ జస్టిస్



కుషాయిగూడలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు భవనం

కుషాయిగూడ: కుషాయిగూడలోని ఆపెల్ భవనంలో ఏర్పాటు చేస్తున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అన్ని హంగులతో ముస్తాబైన జిల్లా కోర్టు భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శనివారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే చేతులమీదుగా జిల్లా కోర్టు ప్రారంభం కానుంది. 2010లో మల్కాజిగిరిలో 3 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన అడిషనల్ జిల్లా కోర్టు 2017 వరకు అక్కడే కొనసాగింది. అదేస్థలంలో అడిషనల్ కోర్టు భవన నిర్మాణానికి రూ.25 కోట్లు నిధులు మంజూరు కావడంతో 2017లో రాచకొండ కమిషనరేట్ సమీపంలోని భవనంలోకి కోర్టును మార్చారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఓ కోర్టు ఏర్పాటు చేసే క్రమంలో ఏడాది క్రితం మల్కాజిగిరి అడిషనల్ కోర్టు జిల్లా కోర్టుగా మారింది. జిల్లా కోర్టు నిర్మాణానికి 3 ఎకరాల స్థలం సరిపోదని అప్పటి న్యాయశాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో తాజాగా నేరెడ్‌మెట్‌లోని డైట్ కాలేజ్ సమీపంలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. భవన నిర్మాణం కోసం రూ.90 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. జిల్లా కోర్టుగా మారడంతో ప్రస్తుతం ఉన్న తాత్కాలిక భవనంలో పార్కింగ్ ఇతరత్రా సమస్యలతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో కుషాయిగూడలోని ఆపెల్ భవనాన్ని అద్దెకు తీసుకొని తాత్కాలికంగా జిల్లా కోర్టు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చాలా రోజులుగా నిరుపయోగంగా ఉన్న ఆపెల్ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్ది జిల్లా కోర్టు ప్రారంభోత్సవానికి అధికారులు సిద్ధమయ్యారు.

▼ గ్రౌండ్‌ఫ్లోర్‌లో..

జిల్లా ప్రధాన న్యాయస్థానం, అడిషనల్ జిల్లా కోర్టు కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జ్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, ఫస్ట్ అడిషనల్ సీనియర్ జడ్జ్ కోర్టులు.

▼ ఫస్ట్ ఫ్లోర్‌లో..

సెకండ్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్‌తో పాటు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్, ఫస్ట్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, సెకండ్ జూనియర్ సివిల్ జడ్జ్, సెకండ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు.

▼ సెకండ్ ఫ్లోర్‌లో..

మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, మూడో అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు.

సౌకర్యవంతంగా ఉంది

ప్రస్తుతం నిర్వహిస్తున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు భవనం ఇరుగ్గా ఉండి ఇబ్బందులు ఎదురయ్యాయి. కుషాయిగూడలో ఏర్పాటు చేసిన తాత్కాలిక జిల్లా కోర్టు భవనం న్యాయవాదులు, కక్షిదారులకు సౌకర్యవంతంగా ఉంది. అవసరమైన పార్కింగ్ స్థలంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో కోర్టు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

- పెంచాల సురేందర్‌రావు, జవహర్‌నగర్ స్టాండింగ్ కౌన్సిల్



రూ.10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



కాప్రా వినాయక్‌నగర్‌లో నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శుక్రవారం కాప్రా డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. శ్రీశివసాయినగర్‌లో రూ.10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శాలివాహన ఎన్‌క్లేవ్‌లో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి, వినాయక్‌నగర్ కాలనీ ఫేస్–2లో మంచినీటి సరఫరాను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, బీఆర్ఎస్ నాయకులు సూదుగు మహేందర్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, గిల్‌బర్ట్, బేతాళ బాలరాజు, రవీందర్‌రెడ్డి, మహేష్, కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

హబ్సిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల పాలిట వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంకు చెందిన పలువురికి శుక్రవారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బద్దం భాస్కర్‌రెడ్డి, గరిక సుధాకర్, వనంపల్లి గోపాల్‌రెడ్డి, శ్రీధర్, వినీష్‌రెడ్డి, బాజీభాషా, రమేష్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు మీటర్లు లేక సతమతం



ఓల్డ్ అల్వాల్‌లోని విద్యుత్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని జొన్నబండలో నివాసముంటున్న అర్హులైన వారికి ఎలక్ట్రికల్ మీటర్లు అమర్చాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఓల్డ్ అల్వాల్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓల్డ్ అల్వాల్‌లోని జొన్నబండలో 60, 70 ఏళ్లుగా సంచార జాతి, వడ్డెర జాతి వారు నివాసం ఉంటున్నారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఇంటి మీటర్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నా మీటర్లు ఇవ్వలేదన్నారు. అప్పటి నుంచి నీటి బిల్లులు, ట్యాక్స్‌లు కూడా తమవద్ద నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ ఉన్నా కరెంటు మీటర్లు లేక సతమతం అవుతున్నారన్నారు. మీటర్లు ఏర్పాటు చేసి వారి ఇళ్లలో వెలుగు నింపాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు దండుగుల వెంకటేష్, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, రవికిరణ్, మల్లికార్జున్ యాదవ్, మాచర్ల శ్రీనివాస్, బన్సీలాల్, అనిల్‌కుమార్, గణేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించాలి



బూత్‌స్థాయి అధికారులతో డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: రాబోయే ఎన్నికల ప్రక్రియను సక్రమంగా ఉండే విధంగా బూత్ లెవెల్ అధికారులతో అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు కల్పించే విధంగా ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే సవరించాలని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 27 వరకు, వచ్చేనెల 2, 3వ తేదీల్లో ప్రతి పోలింగ్ బూత్ వద్ద అధికారి ఉంటాడని వారి సలహాలు తీసుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ నరసింహారెడ్డి, సూపర్‌వైజర్ స్వామి, నారాయణరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రేపు ఓటరు నమోదు



ఎమ్మార్వో హసీనా

మేడిపల్లి: 18 సంవత్సరాలు నిండిన వారికి శని, ఆదివారాల్లో మేడిపల్లి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మేడిపల్లి ఎమ్మార్వో హసీనా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బూత్ లెవల్ అధికారి(బీఎల్ఓ) అందుబాటులో ఉంటారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడిపల్లి ఎమ్మార్వో హసీనా విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ఉప్పల్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

పీసీసీ సభ్యుడు మేకల శివారెడ్డి



గాంధీ భవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న మేకల శివారెడ్డి

ఉప్పల్: ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీసీసీ సభ్యుడు మేకల శివారెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని ఇప్పటికీ ఆరుసార్లు పార్టీ అధిష్టానానికి అర్జీ పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ సారి తప్పకుండా అవకాశం కల్పించాలని కోరుతూ తన బయోడేటాను గాంధీ భవన్‌లో సమర్పించినట్లు తెలిపారు. 1978 నుంచి కాంగ్రెస్‌కు ఎనలేని సేవలు చేసినట్లు తెలిపారు. 1978 నుంచి 81 వరకు విలేజ్ అధికారిగా 1981 నుంచి 87 వరకు సర్పంచ్‌గా, 1988 నుంచి 1992 వరకు మున్సిపల్ ఛైర్మన్‌గా పని చేసినట్లు తెలిపారు. రాజకీయంలో అపార అనుభవం ఉన్న తనకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు విలేకరులపై కేసు

మేడిపల్లి: అనుమతులు లేకుండా నిర్మాణం ఎలా చేస్తున్నావని ఓ ఇంటి యజమానిని బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పర్వతాపూర్ సాయిఐశ్వర్య కాలనీలో రోడ్ నంబర్–9లో నివాసం ఉంటున్న వెలమనేని నరేందర్‌రెడ్డికి తన ఇంటి ఎదురుగా ఉన్న ప్లాట్‌లో రేకుల షెడ్డు ఇటీవల కురిసి వర్షాలకు కురుస్తుండడంతో షెడ్డు మరమ్మతులు చేసి కార్ పార్కిగ్ ఏర్పాటు చేసుకున్నాడు. నాగిరెడ్డి(అక్షర శోధన), కుమారస్వామి(జ్యోతి) తాము పత్రికా విలేకరులమని, మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా షెడ్డును ఎలా నిర్మిస్తావని టౌన్‌ప్లానింగ్ అధికారులతో చెప్పి కూల్చివేయిస్తామని, తమ పేపర్‌లో రాస్తామని బెదిరించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఇవ్వాలని బెదిరిస్తూ.. డిమాండ్ చేసి వెళ్లిపోయారు. వారం రోజుల నుంచి నాగిరెడ్డి తరచూ ఫోన్ చేసి వేధిస్తుండటంతో ఈ నెల 24వ తేదీన రూ.8 వేలు ఇచ్చానని బాధితుడు పోలీసులకు తెలిపాడు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గురువారం మేడిపల్లి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డబ్బులు తీసుకున్న నాగిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన 24 గంటల నిరసన దీక్ష



కుషాయిగూడ: బీసీ, ఎంబీసీ కులాలను మోసం చేస్తున్న కేసీఆర్ వైఖరికి నిరసనగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ చేపట్టిన 24 గంటల నిరసన దీక్ష శుక్రవారం ముగిసింది. ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎంబీసీ కులాలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టేందుకే ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తానన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందే వరకు పోరాటం ఆగదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు.

ఉప్పల్‌లో బీఆర్ఎస్‌కు షాక్

గడ్డం సాయికిరణ్ రాజీనామా



మాట్లాడుతున్న గడ్డం సాయికిరణ్

రామంతాపూర్: బీఆర్ఎస్ టికెట్ల కేటాయింపుల్లో బీసీలకు జరిగిన అన్యాయానికి నిరసనగా బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా సమర్పించినట్లు రామంతాపూర్ సత్యసాయి విద్యా సంస్థల చైర్మన్, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం సాయికిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిష్టానం బీసీలకు తక్కువ సీట్లు కేటాయించి వారి పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించిందని, అదేవిధంగా ఉద్యమకారులకు తీవ్రం అన్యాయం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. బీసీలకు కేవలం 23 సీట్లు కేటాయించడం దారుణం అన్నారు. ఈ నెల 27న ఆదివారం ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో బీజేపీ పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ఓటమికి కార్యకర్తలు, నేతలతో కలిసి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగి వెంకట్‌రెడ్డి, పారుపల్లి హనుమంతరావు, నాగరాజు, అనిల్, సుధాకర్, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, గడ్డం సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న ఎన్ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్

కుషాయిగూడ: ఇలాంటి వేదికలతోనే విద్యార్థుల్లోని ప్రతిభ వెలికి వస్తుందని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ అన్నారు. అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఎఫ్‌సీ గురుకుల్ భవనంలో నిర్వహించిన ఈస్ట్‌జోన్ అణుశక్తి కేంద్రీయ విద్యాలయాల హిందీ డిబేట్, క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టిగా నిర్వహించే ఇలాంటి పోటీలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. వారిలో ఉన్న నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈస్ట్‌జోన్ పరిధిలోని 7 కేంద్రీయ పాఠశాలలు పాల్గొనే ఈ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఏఈసీఎస్–2 ప్రిన్సిపల్ ఎంఎన్‌వీపీ నాయుడు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్తుడి అరెస్టు



అన్వర్

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్తుడిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీ చెందిన షేక్ అన్వర్(23) ఒడిశా ప్రాంతానికి చెందిన ఉమాతో పరిచయమైంది. వీరిద్దరూ కలిసి గంజాయి సేవించేవారు. ఉమాతో కలిసి తరచూ ఒడిశాకు వెళ్లి అక్కడ నుంచి గంజాయి తీసుకువచ్చి ఇద్దరు కలిసి సేవించేవారు. మిగిలిన గంజాయిని విక్రయించి సొమ్ము చేసుకుని జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో గురువారం ఉప్పల్ పారిశ్రామికవాడ వద్ద 300 గ్రాముల గంజాయి తీసుకొని వెళ్తుండగా ఎస్సై మధుసూదన్ అన్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఉమా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అన్వర్ నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడే వాడని, జైలుకు వెళ్లి వచ్చినా అతడిలో మార్పురాలేదని పోలీసులు తెలిపారు.

‘డబుల్’ పారదర్శకత!

- అర్హులైన పేదలకు డబుల్ ఇళ్ల కేటాయింపు
- టాంపర్ ఫ్రీ సాఫ్ట్‌వేర్‌తో అర్హుల ఎంపిక
- ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలో 2వేల మంది ఎంపిక
- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో నిరుపేదలకు సొంతింటి కల సాకారమవుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఇళ్లు లేని పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సదుద్దేశ్యంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించి, వాటిని ఎంతో పారదర్శకంగా కేటాయిస్తోందని, ఎలాంటి పైరవీలు, జోక్యం లేకుండా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, సంబంధిత జిల్లా శాఖల అధికారులు, మీడియా సమక్షంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపును ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ డ్రా నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 500 మంది లబ్ధిదారుల చొప్పున నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2 వేల మంది అర్హులైన లబ్ధిదారులను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ (టాంపర్ ఫ్రీ) ద్వారా ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 1,75,959 దరఖాస్తులు వచ్చాయని శుక్రవారం వరకు అర్హత కలిగిన లబ్ధిదారులు 24,717 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి మొదటి విడతగా 500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇలాంటి ప్రక్రియ దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియతో అర్హులైన పేదలందరికీ ఇళ్ల కేటాయింపు జరిగేంత వరకు నిరంతరం కొనసాగుతుందని మంత్రి వివరించారు.

ఇళ్ల కేటాయింపులో పారదర్శకత: కలెక్టర్ అమయ్‌కుమార్

జిల్లావ్యాప్తంగా అర్హులైన నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే విధానంలో భాగంగా పారదర్శకంగా, జవాబుదారి తనంతో వ్యవహరించామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. జాతీయ సమాచార కేంద్రం(ఎన్ఐసీ) వారి సహకారంతో తారుమారు చేయకుండా ఉండేలా(టాంపర్ ఫ్రీ) సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులైన వారికి ఇళ్లను కేటాయించామన్నారు. కేటాయింపుల విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదన్నారు. అలాగే తక్కువ సమయంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక జరిగేలా సాఫ్ట్‌వేర్ డెవలప్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఒకసారి ఎంపికైన లబ్ధిదారుడు మళ్లీ ఎంపిక కాకుండా ఉండేందుకు ఆధార్ నంబర్ ప్రాతిపదికన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామని పేర్కొన్నారు. ఈ విధానంతో సమయం, తేదీ కూడా సాఫ్ట్‌వేర్‌లో నమోదవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.రవీందర్, రోడ్లు భవనాల శాఖ అధికారి శ్రీనివాసమూర్తి, సీపీవో మోహన్‌రావు, ఆర్డీవోలు రాజేష్‌కుమార్, శ్యామ్‌ప్రకాశ్, డిప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.